క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం శ్రీకాకుళం జిల్లా మందసకు చెందిన ఆర్.తిరుపతిరావు అనేదాత లక్ష 116 రూపాయల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

సీఎం జగన్ బస్సుయాత్రకు తరలిరండి

పరవాడ: ఈ నెల 21న పెందుర్తి కూడలికి చేరుకోనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సుయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు కోరారు. ఈ నెల 21న ఉదయం 8 గంటలకు బస్సుయాత్ర పెందుర్తి కూడలికి చేరుకుంటుందన్నారు. మండలంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పార్టీ శ్రేణులు హాజరై సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలకాలని శ్రీనివాసరావు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సెక్షన్-1 పరిధిలోని 33/11 కేవీ,సబ్బవరం సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ వర్క్‌లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.దీనితో సబ్బవరం,తవ్వవానిపాలెం,అమృతపురం,గొల్లలపాలెం,పైడివాడ,అసకపల్లి, ఇరువాడ పంచాయతీల పరిధిలోని గ్రామాలతో పాటు పల్లవానిపాలెం,జాగరపువానిపాలెం గ్రామాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామ్మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

సెల్లార్‌లో పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: మద్యం మత్తులో ఎన్ఏడీ జంక్షన్ సమీప నిరుపయోగంగా ఉన్న ఒక భవనం సెల్లార్‌లో పడి రాజాన శ్రీను మృతి చెందాడు. స్థానికులు, ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన రాజాన శ్రీను ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీను సాయంత్రం నాలుగు గంటల వరకు ఫోన్‌లో అందుబాటులో ఉన్నాడు.తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. గురువారం వాకింగ్‌వెళ్లిన సెల్లర్‌లో రాళ్ల మధ్య పడి ఉన్న వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారమందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని 108కి సమాచారమందించారు. వాళ్ల పరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. మృతునికి భార్య నాగమణి, కుమార్తె భాను ఉన్నారు. నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జగదాంబ : గుర్తు తెలియని మృతదేహం గురించి గురువారం హార్బర్ పోలీసులకు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోర్టులోని ఎఫ్ఆర్పీ టెక్ కంపెనీలోని వంతెన నిర్మాణ పనుల వద్ద వానపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను కాలువ వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా అక్కడ గుర్తు తెలియని మృతదేహాన్ని చూశాడు. వెంటనే పోర్టు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయతో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు సమాచారం అందజేయాలని హార్బర్ పోలీసులు తెలిపారు.

సొంతింటి కల సాకారం దిశగా..



గొల్లలపాలెంలో పూర్తి కావచ్చిన గృహ నిర్మాణాలు



అసకపల్లిలో తుది దశకు చేరుకున్న గృహ నిర్మాణాలు

- శరవేగంగా సాగుతున్న పట్టణ పేదల గృహ నిర్మాణాలు
- ఇప్పటికే లబ్ధిదారుల చేతికి స్థల రిజిస్ట్రేషన్ పట్టాలు

సబ్బవరం: ప్రతి పేదోడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. దీనిలో భాగంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు చేపట్టేందుకు పూనుకుంది.మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో 10,500 ఇళ్ల నిర్మించేందుకు ఏర్పాటు చేసిన మెగా లే అవుట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదగా ప్రారంభించారు. దీంతో పట్టణ ప్రాంత లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సొంతిల్లు లేని పట్టణ ప్రాంత లబ్ధిదారులకు ప్రభుత్వం సెంటు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.దీనిలో భాగంగా సెంట్ స్థలానికి సంబంధించిన పట్టాలు అందజేయడంతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులు అందజేసింది. ఇంటి నిర్మాణానికి రూ.1,80,000 మంజూరు చేసింది.ఇల్లు నిర్మించుకునే స్తోమత లేని లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ముందుకు వచ్చింది.

ఇదీ పరిస్థితి

మండలంలోని పలు లే అవుట్‌లలో 20,778 అర్బన్ హౌసింగ్ ఇళ్లను ప్రభుత్వం నిర్మించనుంది.వీటిలో ఇప్పటికే 412 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వీటిలో 2460 ఇళ్లు శ్లాబ్‌లు పూర్తి కావడంతో తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి. 1820 ఇళ్లు శ్లాబ్ లెవల్‌కు వచ్చాయి. మరో 16,086 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌లో ఉన్నాయి.

మౌలిక వసతుల కల్పన షురూ

మండలంలో ఏర్పాటు చేసిన సుమారు 8 లే అవుట్‌లలో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఆయా లే అవుట్‌లో అవసరమైన విద్యుత్ లైన్లతో పాటు మిగిలిన అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే పలు లేఅవుట్లలో రోడ్లు ,డ్రైన్ల నిర్మాణం పూర్తి కావచ్చింది. మిగిలిన చోట కొనసాగుతున్నాయి. వీటిలో పాటు అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లకు భూములు ఇచ్చిన రైతులకు రీ కన్‌స్ట్రక్టడ్ ప్లాట్‌లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులను అందజేసింది.

గ్రామం	లేఅవుట్	నిర్మాణంలో ఉన్న ఇళ్లు
పైడివాడ	పైడివాడ	9,030
అగ్రహారం	అగ్రహారం	
అసకపల్లి	అసకపల్లి	1,328
గాలిభీమవరం	గాలిభీమవరం	1398
గాలిభీమరం	గాలిభీమవరం-2	2,385
గొల్లలపాలెం	గొల్లలపాలెం-1	1061
గొల్లలపాలెం	గొల్లలపాలెం-2	5472
గొల్లలపాలెం	గొల్లలపాలెం-3	752
గొల్లలపాలెం	గొల్లలపాలెం-4	352



అసకపల్లిలో నిర్మాణంలో ఉన్న అర్బన్ హౌసింగ్ గృహాలు

పెట్రోల్ బంకుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సబ్బవరం ఫైర్ సిబ్బంది

సబ్బవరం: పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉండడంతో ఇంధన వినియోగదారులు,యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఇరువాడ పెట్రోల్ బంకు వద్ద గురువారం అగ్ని ప్రమాదాలపై ఆయన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.వాహనదారులు తమ వాహనాలకు పెట్రోల్ నింపేటప్పుడు సెల్ ఫోన్లలో మాట్లాడకుండా ఉండేవిధంగా నిర్వాహకులు చూసుకోవాలన్నారు.వాహనాలు దిగి పెట్రోల్‌ను వారి వాహనాలకు నింపుకునేవిధంగా చూసుకోవాలన్నారు.అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అగ్నిమాపక ఎక్యూప్‌మెంట్‌ను వినియోగించి ప్రమాదాలను అదుపుచేసే మాక్ డ్రిల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సబ్బవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది కె. రాజారావు,కె. ఎల్లాజీ,ఎం. శ్యామ్ కుమార్,కె. మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ



ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను మండల పరిషత్ కార్యాలయం వద్ద పబ్లిష్ చేస్తున్న ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కాపీలను ఎంపీడీవో రామ్మోహనరావు గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ కాపీలను అన్ని సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. ఎంపీకి నామినేషన్ వేసే అభ్యర్థులు అనకాపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో.. ఎమ్మెల్యే అభ్యర్థులు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ ఫారాలు అందజేయాల్సి ఉంటుందన్నారు.

సాధికారతపై విద్యార్థినులకు అవగాహన



వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ బాలిక సాధికారిత మిషన్-2024లో భాగంగా గురువారం దీపాంజలినగర్ సంయుక్త ఫంక్షన్ హాల్లో బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సాధికారత , పరివర్తనాత్మక విద్యా అనుభవాలకు వేదికగా ఈ వర్క్ షాపు నిలిచింది. బేస్‌లైన్ సర్వేలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వచ్చే నాలుగు వారాలు నిర్వహించనున్న రెసిడెన్సియల్ వర్క్‌షాపులో విద్యారంగం, అవసరాలను అర్థం చేసుకోవడంలో మొదటి దశ పూర్తవుతుంది. హెచ్ఆర్ మేనేజర్ కె.ప్రకాశరావు మాట్లాడుతూ బాలికలను ప్రోత్సహించాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీఎస్సార్ ఎగ్జిక్యూటివ్ శివం ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న పోలమాంబ జాతర



మాట్లాడుతున్న ఈవో కె.గాయత్రి

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో కె.గాయత్రి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 22న తొలేళ్ల ఉత్సవం, 23న అనుపు మహోత్సవం జరుగుతుందన్నారు. 23వ తేదీ ఉదయం 3 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. పంచామృతాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం రూ.50, విశిష్ట దర్శనం రూ. 100, ప్రత్యేక లఘు దర్శనం రూ.500 క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు, జీవీఎంసీ, వైద్యారోగ్య శాఖ, వలంటీర్లు, ఆలయ సిబ్బంది సహకారంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగు నీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు. చంటి పిల్లల తల్లులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె వివరించారు. ఈ సమావేశంలో పురోహితులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బౌర్రమాంబ పుట్టబంగారు మహోత్సవం

పోటెత్తిన భక్తులు



బౌర్రమాంబ అమ్మవారు



ఊరేగింపులో రహదారులను పసుపునీటితో తడుపుతున్న భక్తులు

అగనంపూడి: అగనంపూడి పరిసర 8 గ్రామాలకు చెందిన ప్రజల ఇలవేల్పు బౌర్రమాంబ అమ్మవారి పుట్ట బంగారు మహోత్సవాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వనం వద్ద వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బిందెలతో పసుపునీటితో అభిషేకాలు చేశారు. సాయంత్రం పుట్ట బంగారు ఉత్సవం సందర్భంగా వనం నుంచి గ్రామం వరకు అమ్మవారి ఊరేగింపు జరిగింది. దారి పొడవునా మహిళలు పసుపు నీళ్లతో మార్గాన్ని తడిపి, అమ్మవారిని స్వాగతించారు. వనం నుంచి గ్రామం వరకు సుమారు కిలోమీటరు దూరం వేలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారి పొడవునా భక్తులు కిక్కిరిసిపోవడంతో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేష్ పర్యవేక్షణలో ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉక్కు సీఎండీని తొలగించాలని డిమాండ్

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన 33 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మొదటి విభాగమైన కోక్ ఓవెన్‌కు అవసరమైన కోకింగ్ కోల్ కొరతను యాజమాన్యం సృష్టించిందని, అందుకు బాధ్యులైన స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను వెంటనే తొలగించాలని సిటు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోక్ ఓవెన్‌లో ముడి సరుకు అయిన 30 వేల టన్నుల కోకింగ్‌కోల్ గంగవరం స్టాక్ యార్డ్‌లో ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, గంగవరం పోర్టుకు మధ్య గోడే అడ్డుగా ఉందని, గంగవరం పోర్టులో ఉన్న కోకింగ్ కోల్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రప్పించలేకపోయారని ప్రశ్నించారు. ఈ నెల 21న స్టీల్‌ప్లాంట్ వద్ద కార్మిక గర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

నేడు అదీప్‌రాజ్ నామినేషన్



పెందుర్తి: వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు పెందుర్తి మండలం రాంపురంలోని అదీప్‌రాజ్ స్వగృహం నుంచి ర్యాలీగా బయలుదేరుతారు. అనంతరం ఉదయం 11.45 గంటలకు పెందుర్తి రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. ముందుగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారని పార్టీ ప్రతినిధులు వెల్లడించారు.

ముత్తంశెట్టికి నాయీ బ్రాహ్మణుల మద్దతు

వైఎస్సార్‌సీపీలో 60 కుటుంబాల చేరిక



ముత్తంశెట్టిని సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 98వవార్డు పరిధిలోని నాయీ బ్రాహ్మణులు మద్దతు పలికారు. నగరంలోని ముత్తంశెట్టి స్వగృహంలో ఆయన్ను గురువారం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు సిరెల అప్పారావు,యువ నాయకుడు తెలగరావు కుమార్ ఆధ్వర్యంలో 60 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు ముత్తంశెట్టి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అడవివరం నుంచి వీరంతా ప్రత్యేక బస్సులో ముత్తంశెట్టి ఇంటికి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ వెంటే నాయి బ్రాహ్మణులమంతా ఉన్నామని, మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ముత్తంశెట్టిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారికి ముత్తంశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన వర్గాల వారిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకున్నారని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపులేని వెనుకబడిన బడుగు, బలహీన కుటుంబాటల్లో జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల ట్రస్ట్‌బోర్డు నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ చట్టం చేసి వారికి సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌మోహనరెడ్డిదే అన్నారు. భవిష్యత్తులో నాయీ బ్రాహ్మణులంతా ఏకగ్రీవంగా సూచించిన వ్యక్తికే ట్రస్ట్‌బోర్డులో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముత్తంశెట్టిని కలిసినవారిలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు వెంపడపు శివరావు, టి.నరసింగరావు, చిప్పాడ అప్పలరాజు, గండ్రెడ్డి సూరిబాబు, చిప్పాడ సాయి, చిప్పాడ రఘు, మొలిపాక తరుణ, తెలగరావు అప్పలరాజు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకులు ఎస్.అప్పారావు, ఎర్ర దేవి వరప్రసాద్, వైడీవీ ప్రసాద్, సాడి మధురెడ్డి, కొలుసు శ్రీను తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



ఈ.బోనంగిలో దుర్గమాంబను దర్శించుకున్న గ్రామ పెద్దలు



గొర్లివానిపాలెంలో బంగారుమాంబను దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలో ఈ.బోనంగి దుర్గమాంబ, గొర్లివానిపాలెం బంగారుమాంబ పండగలను ఆయా గ్రామాల ప్రజలు గురువారం వైభవంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచి గ్రామ దేవతలను దర్శించుకోవడానికి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ బొద్దపు చిన్నారావు, గ్రామ పెద్దలు మేడిశెట్టి బాలాజీనాయుడు, మేడిశెట్టి అప్పారావు, ఎం.వెంకటరావు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. డప్పువాయిద్యాలు, కోయడ్యాన్సులు, నేల డ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి అనుపుమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- గొర్లివానిపాలెంలో కొలువుదీరిన బంగారు మాంబ పండగను గ్రామ ప్రజలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, ఉప సర్పంచ్ గొర్లి రామారావు, గ్రామ పెద్దలు గొర్లి శ్రీను, గిరిబాబు, కేవీ ప్రసాద్, చిప్పాడ రామారావు, పైల అప్పారావు, పోలిరెడ్డి అప్పారావు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రికి అమ్మవారిని డప్పువాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించి బాణ సంచాకాల్పులతో అనుపోత్సవం నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేవరకు పోరాటం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు కార్మికుల దృఢ సంకల్పంతో ఉన్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, కార్మికుల ఉద్యమాల ముందు తలవంచక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద 1162వ రోజు, గురువారం దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే ఉక్కు అధికారులకు త్వరలోనే తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



అగనంపూడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రామనారాయణ

కూర్మన్నపాలెం: ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లీడర్ రామనారాయణ, హెడ్ కానిస్టేబుల్ అప్పారావు వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా రామనారాయణ మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామన్నారు. ఏ వాహనంలోనైనా 50 వేలకు పైబడి నగదు ఉన్నట్లు గుర్తిస్తే దానికి సంబంధించి సరైన ఆధారాలను చూపించాలని, లేకుంటే ఆ నగదును సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట : అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి కోకింగ్ కోల్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం విశాఖ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు వల్ల సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులైన గంగవరం , దిబ్బపాలెం గ్రామాలకు చెందిన 600 కుటుంబాలకు పోర్టులో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని, 10 ఏళ్లుగా పని చేస్తున్నా రూ.15 వేలకు మించి వేతనం ఇవ్వడం లేదన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై క్యాబినెట్‌లో తీర్మానం చేయలేదన్నారు.